సాక్షి నంద్యాల

గురువారం । 31 । అక్టోబర్ । 2024



వీనుల విందుగా..

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై బుధవారం విజయవాడకు చెందిన శ్రీనివాస భజన బృందం వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది.



సాక్షి గణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని సాక్షి గణపతి, జ్వాలా వీరభద్రస్వాములకు బుధవారం సాయంత్రం పూజలు నిర్వహించారు. అభిషేకాలు, విశేషపుష్పార్చన చేపట్టారు.



సిండికేట్ మాయాజాలం

కర్నూలు మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌తో ధరలు తగ్గి రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రికార్డు స్థాయిలో 27 వేల క్వింటాళ్లు యార్డుకు చేరుకుంది. 8లో ▸

ఆనంద జావళి... వెలుగుల దీపావళి

- నేడు దీపావళి (నరక చతుర్దశి)
- చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా సంబరాలు



టపాసుల సంచులతో..

కర్నూలు కల్చరల్: దీపావళి అంటే వెలుగుల పండగ. దీపకాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. దీపావళి అంటేనే జీవితాల్లో వెలుగు తెస్తుందని ప్రజల నమ్మకం. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే సిరి కాంతుల పండగ. చీకటిని చీల్చుకుంటూ వెలుతురిని వెతుక్కుంటూ సాగడమే మానవ జీవితపు పరమార్థం. అలాంటి విజయపు వెలుగుల్ని ప్రజలందరికీ పంచే వేడుక ఇది. జిల్లాలో గురువారం నరక చతుర్దశి (దీపావళి)ని వైభవంగా జరుపుకోనున్నారు. దీపకాంతులతో ఇంటిని అలంకరించి చిన్నా పెద్దా తేడా లేకుండా పండగను ఆనందాలతో జరుపుకుంటారు. స్వాతి నక్షత్రంతో కలిసిన అమావాస్య నాడు దీపావళి జరుపుకోవాలని శాస్త్రం చెబుతుంది. ఈ రోజున దీపలక్ష్మి తన సహస్ర కిరణ కాంతులతో జ్ఞాన జ్యోతుల్ని ప్రకాశింప జేస్తుంది. దీపావళి రోజు తప్పనిసరిగా మహాలక్ష్మి పూజ చేస్తారు. వేయి పడగలపై భూభారాన్ని మోసే ఆదిశేషుడు తన పడగల్ని మార్చుకునే ఘట్టంలో భూమిపై ఏర్పడే మార్పులకు సంకేతంగా నరక చతుర్దశిని వర్ణించారు. అజ్ఞాన జనితమైన వేదనే నరకం. ఆ వేదనని నివారించే జ్ఞాన దీపకాంతి దైవత్వం. నరక చతుర్దశి విశిష్టత ఖగోళ విజ్ఞానంతో ముడిపడి ఉంది. నరక చతుర్దశికి రూప చతుర్దశి అని మరోపేరు ఉంది. అంటే రూపాన్ని ప్రకాశింపజేసే పర్వం అని అర్థం. ఈ రోజు సూర్యోదయానికి పూర్వమే పవిత్ర అభ్యంగ స్నానాన్ని ఆచరిస్తే శరీరానికి దివ్య శక్తి కలుగుతుందంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దీపావళిని వేడుకలను అట్టహాసంగా నిర్వహించుకోనున్నారు.



నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో బాణాసంచా కొనుగోలు చేస్తున్న దృశ్యం

దీపకాంతితో.. చెడు శక్తుల నిర్మూలన

హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం ఇంటిలో దీపకాంతి ఉంటే ఎలాంటి చెడు శక్తులు ప్రవేశించవని నమ్మకం. ఆ వెలుగులు ఆ నమ్మకాలు స్వచ్ఛంగా ఉండాలంటే నూనెతో వెలిగించే ప్రమిదలే మంచివి. దీపావళి వచ్చిందంటే ఇళ్లు వ్యాపార సంస్థలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తారు. అలా కాకుండా మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించి అలంకరణ చేయడమే ఉత్తమం. ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కడ చూసినా అల్యూమినియం, గట్టి ప్లాస్టిక్‌తో చేసిన ప్రమిదలే కనిపిస్తున్నాయి. వాటి వల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉంది. కనుక ఇంటిలో దీపాలు పెట్టేందుకు మట్టి ప్రమిదల్నే ఉపయోగించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. గోధుమ పిండి ప్రమిదలు, కొబ్బరి చిప్పలు, పండ్ల తొక్కల్లోనూ దీపాలు వెలిగించొచ్చని చెబుతున్నారు.



సంప్రదాయాలను మరవ కూడదు

ఇంటి ముందు దీపకాంతులు దార్యిద్య నాశనానికి ప్రతీక. దీప కాంతుల నడుమ శ్రీ మహాలక్ష్మిని అష్టోత్తర శత నామాలతో ఆరాధిస్తే అమ్మవారి అనుగ్రహం అపారంగా ఉంటుంది. దీపావళి రోజు ప్రమిదల్లో జ్యోతులు వెలిగించి పూజ చేస్తే పుణ్యం లభిస్తుంది. మన సంస్కృతి సంప్రదాయాలను మరవ కుండా వేడుకలను సమైక్యంగా నిర్వహించుకోవాలి.

– విద్వత్ శిఖామణి జనార్ధన రామానుజ పండితులు, కర్నూలు

న్యూస్‌రీల్

విద్యాభివృద్ధికి కృషి చేయండి

- డీఈఓ జనార్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి ఎంఈఓలకు సూచించారు. బుధవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్కూల్ కాంప్లెక్స్, పేరెంట్స్ మీటింగ్, వృత్యంతర శిక్షణ, టీచర్స్ మేళా, అపార్ ఐడీస్, పని సర్దుబాటు, పీఎంశ్రీ పాఠశాలలు, పాఠశాల మౌలిక వసతులపై ఏర్పాటు చేసిన ఎంఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, ఆయాల పనితీరు, మరుగుదొడ్ల నిర్వహణ నిధుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించేందుకే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఉప విద్యాశాఖ అధికారి మహమ్మద్ బేగ్, సర్వశిక్ష అభియాన్ అధికారి లలిత, ఉర్దూ డీఏ అస్మోద్దీన్ పాల్గొన్నారు.

31.917 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి



కుడిగట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాలలో మంగళవారం నుండి బుధవారం వరకు 31.917 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.304 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.613 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేసుల నుంచి 39,238 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 97,154 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 31,222 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం జలాశయంలో 199.7354 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నీటి మట్టం 882.10 అడుగులకు చేరుకుంది.

అమరుల త్యాగాలు మరువలేనివి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల(సిటీ): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీనివాస సెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధర నిమ్మ'దించి!

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా ఉంది జిల్లాలోని నిమ్మరైతుల పరిస్థితి. ఆరుగాలం కష్టించినా కాలం కలిసిరావడం లేదు. అతివృష్టి.. అనావృష్టి ప్రభావం ఒక ఎత్తయితే.. అటు నిమ్మ రైతులతో ఇటు వినియోగదారులతో దళారులు అందినకాడికి దోచుకుంటూ లాభాలు మూటగట్టుకుంటున్నారు. రైతుకు మాత్రం చిల్లర పడేస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో వినియోగదారుడికి నిమ్మకాయల ధర వింటే తినకుండానే నోరు పులుపెక్కుతోంది. దసరా, దీపావళి పర్వదినాలు, శుభకార్యాల సమయాల్లో మార్కెట్‌లో దజను రూ.100 వరకు ధర పలుకుతుండగా విడి రోజుల్లో కనిష్టంగా దజను రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. ఒక్కో నిమ్మకాయ రూ.5 నుంచి రూ.6 పైమాటే పలుకుతోంది. కానీ నిమ్మతోటల రైతుల నుంచి మాత్రం స్థానిక మార్కెట్‌లో బస్తా (800 కాయలు) రూ.500 కొనుగోలు చేస్తున్నారు. ఈలెక్కన ఒక్కో నిమ్మకాయ 62 పైసలన్నమాట. – ఆళ్లగడ్డ

- నిమ్మ రైతులతో దళారుల దొంగాట
- రైతు విక్రయిస్తే ఒక్కో కాయ 50 పైసలే.. కొనాలంటే మాత్రం రూ.6
- ఉమ్మడి జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేక అన్నదాతలకు కష్టాలు
- దళారులదే రాజ్యం.. వారు నిర్ణయించిందే ధర
- జిల్లాలో సుమారు 4,500 ఎకరాల్లో నిమ్మ సాగు
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే 4 వేల ఎకరాల్లో సాగు



ఆళ్లగడ్డలో నిమ్మకాయలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో నిమ్మ పంట 4,500 ఎకరాల్లో సాగులో ఉంటే ఇందులో సుమారు 4,000 ఎకరాలకు పైగా ఒక్క ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో సాగవుతోంది. ఏటా సెప్టెంబర్ నుంచి మే, జులై వరకు రెండో సీజన్ ఆగస్టు నుంచి నవంబర్ మాసాల వరకు బస్తా (800 కాయలు) మొదటి రకం అయితే రూ.6,500 నుంచి రూ.7,500, రెండో రకం అయితే రూ.5,000 నుంచి రూ.6,000, చివరి రకం అయితే రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలికేది. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో ధర ఆశాజనకంగానే ఉన్నప్పటికీ కొనుగోలుదారులు లేక దళారులు పాడిందే పాట.. రాసిందే ధర అన్నట్లు నడుస్తుండటంతో రెండు నెలల నుంచి బస్తా రూ.500 నుంచి రూ.600 విక్రయించాల్సి వస్తోంది. దీంతో ఒక్కో రైతు ఎకరాకు రూ.1.5 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. మొత్తం పంట దిగుబడి.. మార్కెట్‌లో పలుకుతున్న ధరను బట్టి చూస్తే ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో ఈ సీజన్‌లో దాదాపు రూ.25 కోట్లకు పైగానే నష్టం ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కొనబోతే కొరివి..

ఆన్‌లైన్ స్టోర్స్‌లో ఒక్కో నిమ్మకాయ రూ.7 చొప్పున ధర పఎలుకుతోంది. కూరగాయల మార్కెట్‌లలో కొనాలన్నా దజను రూ.60 నుంచి రూ.70 పైనే ఉంది. వీటిని పండించే రైతుకు మాత్రం నిమ్మకాయ 50 పైసలు కూడా పలకడంలేదు. కోత కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోతోంది. అలాగని రైతులు కాయలను చెట్టుకే వదిలేయలేకపోతున్నారు. ధర కోసం వేచి చూడటంతో నిమ్మకాయలు చెట్లపైనే మాగి కుళ్లి రాలిపోతున్నాయి. వీటిని ఏరి పొలం గట్లపై పడేస్తున్నారు.



యాదవాడలో తోట వద్ద నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ధర దోబూచులాట

ఈ ఏడాది జూన్ వరకు బస్తా రూ.7 వేల వరకు పలకగా జూలై వరకు బాగానే ఉన్న ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా బస్తా మేలురకం నిమ్మకాయల ధర రూ.500 నుంచి రూ.600 కూడా పలకకపోవడంతో నిమ్మ రైతులు తల్లడిల్లిపోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నిమ్మకు ధర లేదన్నది కొనుగోలు దారుల మాట. గతంలో ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ, బిహార్‌తోపాటు కోల్‌కతా నుంచి బంగ్లాదేశ్‌కు అక్కడి నుంచి అరబ్ దేశాలకు తదితర ప్రాంతాలకు రవాణా అయ్యేవి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ లేదంటూ దళారులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేసి.. వారు మాత్రం అత్యధిక ధరకు ఎగుమతి చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడేళ్లలో జిల్లాలో నిమ్మ సాగు వివరాలు

సంవత్సరం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
2020-21	1,682.5
2021-22	2,907.5
2022-23	3,555.0
2023-24	4,5000

ఈ ఏడాది మార్కెట్‌లో నిమ్మ ధరలు

నెల	బస్తా (800 కాయలు) ధర రూ.ల్లో
ఏప్రిల్	4,000 నుంచి 4,400
మే	4,000 నుంచి 4,500
జూన్	7,500 నుంచి 8,100
జులై	4,500 నుంచి 6,600
ఆగస్ట్	1,500 నుంచి 2,000
సెప్టెంబర్	500 నుంచి రూ 800

మార్కెట్ సౌకర్యం లేక..

సుమారు 100 ఏళ్లకు పైగా జిల్లాలో నిమ్మసాగు చేపడుతున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో ఏటికేడు నిమ్మ సాగు పెరుగుతోంది. అయినా ఉమ్మడి జిల్లా పరిధిలో రైతులు నిమ్మ కాయలు విక్రయించుకునేందుకు మార్కెట్ లేదు. ఆళ్లగడ్డలో మాత్రం ప్రైవేటు మార్కెట్ (దళారి) ఒక్కటి ఉంది. దీంతో రైతులందరూ అక్కడికే కాయలు తీసుకు వచ్చి వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది.

కోత కోయకుంటే.. కాపు కాయదు

ధరలు లేవని నిమ్మకాయల్ని కోయకుండా చెట్టుకే వదిలేయలేరు. అలా చేస్తే తర్వాత వచ్చే కాపు తగ్గుతుంది. పండిన కాయలు రాలి కిందపడినా ఇబ్బందే. ఆమ్లగుణం ఉండటంతో వేర్ల వ్యవస్థ దెబ్బతింటుంది. అందుకే వాటిని ఎప్పటికప్పుడు ఏరి పక్కన పోయాలి. అందుకు కూడా అదనపు ఖర్చు అవుతుంది. ఎలాగూ కోసిన కాయలను మార్కెట్‌కు తరలించి దళారులు ఇచ్చిన కాడికి తీసుకోవాల్సిన పరిస్థితి రైతులకు దాపురిస్తోంది. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎంత ఎక్కువగా ఉన్నా ధరలు పెరగకపోవడం ఏంటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధర పడిపోయింది



ఏడాది పొడువునా తోటల్లో చాకిరీ చేసేది.. ఈ మూడు నెలల్లో ధరలు బాగా పెరుగుతాయని ఆశతోనే. మొదటి కాపు పెట్టుబడికి పోయినా ఈ మూడు నెలల్లో వచ్చే రెండో కాపుతోనే కాస్త ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. అలాంటి సీజన్‌లో ధరలు పడిపోతే ఆర్థిక ఇబ్బందులు తప్పవు. నిమ్మకాయల అమ్మకాలకు జిల్లాలో మార్కెట్ సదుపాయం లేకపోవడంతోనే దళారుల చేతుల్లో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. – రమేష్, మర్రిపల్లె

జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



ఐదేళ్ల నుంచి నిమ్మ సాగు బాగా పెరుగుతోంది. నేను ఐదు ఎకరాల్లో నిమ్మచెట్లు నాటుకున్నాం. నిమ్మకాయల అమ్మకాలకు జిల్లాలో ఎక్కడా మార్కెట్ సదుపాయం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. రైతులే నేరుగా జ్యూస్ ఫ్యాక్టరీల వద్దకు వెళ్లి అమ్ముకోవాలంటే అవి ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదు. దగ్గరలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి.

– ఈశ్వరయ్య, కోటకందుకూరు

వాళ్లు అడిగినంతకే ఇస్తున్నాం



నిమ్మ తోటల సాగుదారులం ఎవరమైనా వాటిని మార్కెట్‌కు తెచ్చేవరకే మాకు వాటిపై హక్కు. ఇక్కడికి తెచ్చిన తరువాత వ్యాపారులు ఎంత చెబితే అంతకే ఇవ్వాల్సి వస్తోంది. పైన ఎంత ధర పలుకుతున్నా మాకు మాత్రం వీళ్లు ఇచ్చిందే తీసుకోవాలి. ఏం చేస్తాం తోటలో కుళ్లిపోతుంటే చూస్తూ ఉండలేక తెంపుకుని వచ్చి వీళ్లకు ఇచ్చిపోతున్నాం. – గోపాల్‌రెడ్డి, కృష్ణాపురం

దళారులు లేకుండా చూసుకోవాలి



రైతులు అందరూ ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే నేరుగా మార్కెట్ వారితో అనుసంధానం చేసుకోవచ్చు. దీంతో దళారీ వ్యవస్థను పూర్తిగా అడ్డుకోవచ్చు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. సాగుదారులు అందరూ అందులో సభ్యులు చేరి దళారి వ్యవస్థ లేకుండా చూసుకోవాలి.

– నాగరాజు, జిల్లా ఉద్యానశాఖాధికారి

ఉల్లి రైతుల సమస్యలు పట్టించుకోండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం చేతకాక.. సరుకు ఎక్కువగా వస్తోందని సాకులు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు కమీషన్‌లపై చూపుతున్న శ్రద్ధలో కనీసం 40 శాతం రైతు సమస్యలపై దృష్టి పెడితే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. బుధవారం ఆయన కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. పంటను అమ్ముకోవడానికి మూడు, నాలుగు రోజులు పడుతోందని, అంతలోగా ఉల్లిగడ్డలు కుళ్లిపోయి ధరపై తీవ్ర ప్రభుత్వాం చూపుతోందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం కాటసాని విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్‌కు ఉల్లి ఎక్కువగా వస్తున్నపుడు ఉదయం 9 నుంచే టెండరు ప్రక్రియ చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వంలో ఐదేళ్లు దాదాపు అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ఉల్లి రైతుల ఇబ్బందులపై మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మితో సమావేశమై చర్చించారు.



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి

టీడీపీ నేతలు లిక్కర్ షాపులతో బిజీగా ఉన్నారు

టీడీపీ నాయకులు లిక్కరు షాపులు, కమీషన్‌ల వేటలో బిజీగా ఉన్నారని కాటసాని విమర్శించారు. రైతు సమస్యలపై దృష్టి సారిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కల్లూరు ఎంపీపీ శారద తదితరులు పాల్గొన్నారు.

స్వీయ సత్ప్రవర్తనతోనే అవినీతి నిర్మూలన

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: అవినీతిని అంతమొందించే ప్రక్రియ స్వీయ సత్ప్రవర్తనతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం సమకూర్చేందుకు కేజీకి రూ.40 ప్రభుత్వానికి ఖర్చవుతుందన్నారు. ఈ బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోకుండా కార్డుదారులు ఇతరులకు విక్రయించుకుంటుండటం బాధాకరమన్నారు. నకిలీ విత్తనాలు, రసాయనిక ఎరువులతో రైతులను రైతులే మోసం చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అవినీతిని ప్రోత్సహిస్తూ పనులు చేయించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రతి సంస్థలో విజిలెన్స్ విభాగం ఉన్నప్పటికీ వ్యక్తుల దృక్పథంలో మార్పు రానంతవరకు అవినీతి కొనసాగుతూనే ఉంటుందన్నారు. జేసీ విష్ణుచరణ్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, అగ్నిమాపక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమణ, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, విజిలెన్స్ ఇన్‌చార్జ్ డీఎస్పీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

మహానందీశుడికి రూ.30.23 లక్షల ఆదాయం

మహానంది: మహానందిలోని అభిషేక మండపంలో బుధవారం హుండీ కానుకలను లెక్కించగా స్వామి వారికి రూ.30.23 లక్షలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతోపాటు కోదండరామాలయం, వినాయకనంది, ఆంజనేయస్వామి తదితర ఆలయాల ద్వారా రూ.29,28,740, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 78,712, గోసంరక్షణ విభాగం ద్వారా రూ.16,062 సమకూరిందన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఏఈఓ ఎరమల మధు, పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఎన్‌బీఏ ఎక్స్పర్ట్ టీం ప్రభుత్వ ఈఎస్సీ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిందన్నారు. విద్యాప్రమాణాలు, ల్యాబ్, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చిందన్నారు. అన్ని విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కళాశాలల్లో నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల ఒకటన్నారు.





రూ.1.20 కోట్లకు బంగారు వ్యాపారి ఐపీ?

కోవెలకుంట్ల: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ రోడ్డులో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యాపారి రూ. 1.20 కోట్లతో ఐపీ పెట్టినట్లు తెలుస్తోంది. కొన్ని సంవత్సరాల నుంచి పట్టణంలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తూ వ్యాపారం కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. కోవెలకుంట్లకు చెందిన వెంకటేశ్వర రెడ్డి వద్ద రూ. 30లక్షలు, అహ్మద్ వద్ద రూ.25 లక్షలు ఇలా మరికొంత మంది వద్ద రూ.కోటికి పైగా అప్పులు చేశాడు. ఈ స్థితిలో పది రోజుల క్రితం ఇల్లు, దుకాణానికి తాళం వేసి భార్య, ఇద్దరు కుమారులతో తిరుపతికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లారు. ఇప్పటివరకు తిరిగి రాకపోగా వారి మూడు సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ వ్యాపారి గత నెలలోనే తనకున్న పొలం అమ్మి రూ.1.60 కోట్ల అప్పులు చెల్లించినట్లు సమాచారం. ఉన్న పొలమంతా అమ్మినా అప్పులు తీరకపోవడంతో చేసేది లేక ఐపీ పెట్టి వెళ్లినట్లు స్థానికులు భావిస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి


పి.ఎం.రెడ్డి (ఫైల్)

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.ఎం.రెడ్డి (58) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, హెడ్‌గార్డు రామలింగం తెలిపిన వివరాల మేరకు.. పి.ఎం.రెడ్డి ఆత్మకూరు మండలం వెంకటాపురం (పిన్నాపురం) గ్రామవాసి. ఆత్మకూరు డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం ఆదోని డిపోకు వచ్చారు. ఈయనకు భార్య శివగంగమ్మ, కొడుకు కళ్యాణ్‌అశోక్‌కుమార్‌రెడ్డి, కుమార్తె సౌమ్యచంద్రిక ఉన్నారు. మంగళవారం ఆదోని–మేలిగనూరు నైట్‌అవుట్ సర్వీస్ డ్రైవర్‌గా వెళ్లి బుధవారం ఉదయం 11:30 గంటలకు డిపోలో డ్యూటీ దిగారు. తర్వాత తోటి ఉద్యోగులతో కలిసి రోడ్డుపై ఉన్న టీస్టాల్ వద్ద టీ తాగుతూ కుప్పకూలిపోయారు. అక్కడున్న వారు హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. డిపో అధికారులు మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామమైన పిన్నాపురానికి తరలించారు. దహన సంస్కారాలకు కొంత నగదును సాయంగా బాధిత కుటుంబసభ్యులకు అందించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పింఛన్ నిధులు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్టీఆర్ పెన్షన్ కానుక కింద నవంబరు నెలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం బుధవారం బ్యాంకులకు విడుదల చేసింది. గురువారం బ్యాంకులకు దీపావళి సెలవు కావడంతో ఒక్కరోజు ముందే నిధులు విడుదల చేసింది. బ్యాంకుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నిధులు డ్రా చేస్తారు. నవంబరు ఒకటవ తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్‌లు పంపిణీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 4,58,404 పింఛన్లకు రూ.194.49 కోట్లు మంజూరయ్యాయి.

దీపావళి శుభాకాంక్షలు శబ్ద కాలుష్య రహిత (Noise Free) దీపావళి జరుపుకుందాం
రోజా బంగి, M.Sc (Audiology),
All India Institute of Speech & Hearing, Mysore
Audiologist & Speech Language pathalogist.
రోజాస్ హియరింగ్, స్పీచ్, బ్యాలెన్స్ & మల్టీ రీహాబ్ సెంటర్
కాక్లియర్ ఇంప్లాంట్ సెంటర్
శ్రీ రాజేశ్వరి నగర్, శకుంతల కళ్యాణ మండపం వెనుక, సంకల్బాగ్ రోడ్డు, కర్నూలు.
సెల్: 94936 00900, 08518 - 271900

TATA POWER SOLAROOF
ప్రధానమంత్రి సూర్యఘర్
ఈ అవకాశం బ్యాంక్ ద్వారా 7% వడ్డీతో ఋణ సదుపాయం కలదు.
SBI Canara Bank Union Bank
ఇంటిపై సోలార్ ప్యానల్ వేసుకొండి 78,000/- ల కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు ఉచిత విద్యుత్తును కూడా పొందండి.
Propriter: S.Janardhan Reddy
కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్
Head Office: Beside CPM Office, Indiragandhi Nagar, Near RTC Bus- Stand, KURNOOL, A.P.
Cell: 81062 20228, 81062 23228, 94400 58086.

గుణంపల్లి పుల్లారెడ్డి చారిటీస్ ట్రస్ట్ : కర్నూలు
ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ (ప్రొఫెషనల్ కోర్సులతో సహా) మొదటి సంవత్సరము చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు
ఉపకార వేతనములు (SCHOLARSHIPS)
దరఖాస్తుల స్వీకరణ
ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ లేక జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి, ఎటువంటి ఆర్థిక సహాయము పొందని ప్రతిభ గల ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ (ప్రొఫెషనల్ కోర్సులతో సహా) విద్యార్థులకు కొన్ని ఉపకార వేతనాలు ట్రస్ట్ ఇవ్వనున్నది. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారములను వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఉచితంగా ఈ క్రింది చిరునామా నుంచి పొందవచ్చును.
SCHOLARSHIPS OF GPR CHARITIES TRUST
G. PULLA REDDY ENGINEERING COLLEGE, KURNOOL - 518 007
ఆసక్తి గల అర్హులైన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులను పై అడ్రస్సుకు 16-11-2024 తేదిలోగా చేరునట్లు పంపవలెను. 2024-2025 విద్యా సంవత్సరములో ఇంటర్మీడియట్ / డిగ్రీ / ప్రొఫెషనల్ కోర్సులలో మొదటి సంవత్సరము చదువుచున్న విద్యార్థినీ,విద్యార్థులు మాత్రమే పరిగణింపబడుదురు. ప్రథమ పరిశీలనలో ఎంపిక కాబడిన అభ్యర్థులు, మౌఖిక పరీక్షకు (Personal Interview) జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు నందు హాజరు కావలసి ఉంటుంది.
MANAGING TRUSTEE G.P.R. CHARITIES TRUST

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
PLOT FOR SALE
■ ఫ్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు అనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-796597]

WANTED
■ ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పని చేయుటకు రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ కావలెను. SREEHARSHA DEVELOPERS. Contact: 95736 45629. [L-796362]
■ కారు డ్రైవర్ కావలెను. కర్నూలు నగరంలో స్కార్పియో వాహనం నడుపుటకు అనుభవం గల కారుడ్రైవర్ కావలెను. సం.ప్ర: 7330924873, 9885485281 [L-796372]
■ మదీనా ఆధార్ సెంటర్‌లో పనిచేయుటకు తెలుగు టైపిస్టు, ఆన్‌లైన్ వర్క్ చేయుటకు ఒకరు చొప్పున కావలెను. షాప్: 20, 21, పుల్లారెడ్డి కాంప్లెక్స్ వెనుక, కలెక్టర్ ఆఫీస్ దగ్గర, కర్నూలు. ✆ 9542226765. [L-796376]
■ డోన్ KVS హాస్పిటల్ ల్యాబ్‌లో (రక్త పరీక్షలు) చేయుటకు ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. సంప్రదించండి: 9533119937. (డాక్టర్ సెల్) 9966376749. PRO [L-796377]
■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు, ఫీమేల్ టెలికాలర్స్, మండల విలేఖరులు కావలెను. జగదీష్ మాల్, 2nd ఫ్లోర్, షాప్ నెం: 223, బిర్లా కాంపౌండ్, కర్నూలు. సెల్: 94403 84846 [L-796374]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-796285]
■ కన్నబిడ్డల్లా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP - 40 వేలు, ఫ్రీ రూమ్+ భోజనం. HYD. Ph: 8317512135 [HA-98890]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09185
70750 09165
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-

సిండికేట్ మాయాజాలం

- మరింత తగ్గిన ఉల్లి ధరలు
- కనిష్ట ధర రూ.449, నగటు ధర రూ.2312 మాత్రమే
- నగం సరుకును కాటా వేయని వైనం
- ఆందోళనలో రైతులు


మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ఉల్లి దిగుబడులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. మొన్నటివరకు ఉన్న తాకిడిని పరిశీలిస్తే బుధవారం మార్కెట్‌కు వెల్లువ తగ్గింది. రికార్డు స్థాయిలో 27 వేలకు పైగా క్వింటాళ్ల ఉల్లిగడ్డలు మార్కెట్‌కు వచ్చాయి. సాయంత్రం వరకు 449 మంది రైతులు తీసుకొచ్చిన 12,883 క్వింటాళ్లను మాత్రమే కాటా వేశారు. వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల ధరలు మరింత తగ్గినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు పథకం ప్రకారం ధరల పెరుగుదలను నిరోధిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 28న మార్కెట్‌లో క్వింటాలుకు గరిష్ట ధర రూ.4,347 లభించింది. మోడల్ ధర రూ.2669 నమోదైంది. తాజాగా ఉల్లి ధర మరింత తగ్గింది. కనిష్ట ధర రూ. 499, గరిష్ట ధర రూ.4141 లభించింది. మోడల్ ధర కేవలం 2312 మాత్రమే నమోదైంది. కేవలం రెండు, మూడు లాట్లకు మాత్రమే మంచి ధరలు లభిస్తుండగా ఎక్కువ మంది రైతులకు కేవలం రూ.1000 నుంచి రూ.2000 వరకే ధర లభించింది. ధరలు తగ్గించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్‌ను నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల పడిగాపులు

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లిని అమ్ముకునేందుకు రైతుల తలప్రాణం తోకకు వస్తోంది. బుధవారం రికార్డు స్థాయిలో 27 వేలకు పైగా క్వింటాళ్ల ఉల్లిగడ్డలు మార్కెట్‌కు వచ్చాయి. అయితే 12,880 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఉల్లి క్రయవిక్రయాల్లో ఇటు అధికారుల నిర్లక్ష్యం అటు వ్యాపారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి వచ్చిన ఉల్లిగడ్డల్లో సగానికి పైగా మార్కెట్లోనే మిగిలిపోయాయి. 600 మందికి పైగా రైతులు ఉల్లి అమ్ముకునేందుకు మార్కెట్లోనే కంటి మీద కునుకు లేకుండా ఉండిపోవాల్సి వచ్చింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు టెండర్ ప్రక్రియను నిర్వహించారు. మిగిలిన ఉల్లిని గురువారం సెలవు రోజైనా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు అంగీకరించారు. ఉల్లి కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడం వల్ల సంచుల్లోని సరుకు కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. టన్నుకు క్వింటాలు వరకు ఉల్లి నష్టపోవాల్సి వస్తోంది. శుక్రవారం అమావాస్య కావడంతో మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించారు. శనివారం ఉల్లిగడ్డలతోపాటు ఇతర పంటలను కూడా కొనుగోలు చేస్తారు.


కాటా ఎప్పుడు వేస్తారోనని వేచి చూస్తున్న ఉల్లి రైతులు


ఉల్లి బస్తాలపై కునుకుతీస్తున్న రైతు

ఓంకారేశ్వరుడికి రూ.2.27 లక్షల ఆదాయం


కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలోని హుండీలో 8 నెలల నుంచి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.2,27,476 నగదు సమకూరిందని దేవస్థాన ఈఓ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల పర్యవేక్షణ అధికారి వి.వేణు, ప్రధాన అర్చకులు మల్లికార్జున, పిట్టం రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కీచక హెచ్‌ఎంపై పోక్సో కేసు

కర్నూలు సిటీ: కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్ ప్రధానోపాధ్యాయుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారపేటలోని శ్రీ విజయ పబ్లిక్ స్కూల్‌లో అదే కాలనీకి చెందిన ఓ బాలిక 8వ తరగతి చదువుతోంది. ప్రత్యేక క్లాసు పేరుతో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆ బాలికను ఓ గదిలోకి తీసుకెళ్లి కొన్ని రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయంపై మంగళవారం బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో స్కూల్ వద్దకు చేరుకొని సదరు హెచ్‌ఎంను పట్టుకొని మూడవ పట్టణ పోలీసులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు విచారణ జరిపి పోక్సో కేసు నమోదు చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- ఎస్‌ఐ, విద్యుత్ ఏఈ మోసం చేయడంతో అఘాయిత్యానికి పాల్పడినట్లు భార్య ఆరోపణ


ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్

పెద్దకడబూరు: ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి మోసగించడంతో పాటు ఇబ్బందులు పెట్టడం వల్లనే తన భర్త పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు భార్య మల్లేశ్వరమ్మ పేర్కొంది. ఆమె తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామానికి చెందిన భాస్కర్ (40) పొలంలో 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీన్నుంచి 3 బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. మరో రెండు బోర్లకు కనెక్షన్ ఇచ్చేందుకు అవకాశం ఉండడంతో రైతు భాస్కర్ దరఖాస్తు చేసుకున్నాడు. అలాగే అతని అన్న ఉరుకుంద దరఖాస్తు చేసుకున్నాడు. ఏఈ సుబ్బారెడ్డి కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లగా.. అన్నదమ్ములకు చాలాకాలంగా వైరం ఉండడంతో తన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ ఇచ్చేందుకు భాస్కర్ అంగీకరించలేదు. దీనిపై ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి భాస్కర్‌ను పిలిపించి మాట్లాడగా.. తాను ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు డబ్బులు ఖర్చుపెట్టుకున్నానని చెప్పడంతో కనెక్షన్ ఇస్తే రూ.10 వేలు ఇప్పిస్తామని చెప్పి సంతకాలు పెట్టించుకున్నారు. తర్వాత డబ్బులు ఇవ్వకుండా బెదిరించడంతో మనస్తాపానికి గురైన భాస్కర్ బుధవారం రాత్రి పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు బాధితుడిని ద్విచక్రవాహనంపై ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా నిబంధనల ప్రకారమే భాస్కర్‌ను ఒప్పించి కనెక్షన్ ఇప్పించామని, విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డిని వివరణ కోరగా పోలీస్‌స్టేషన్‌లో భాస్కర్ ఒప్పుకున్నందుకే ఉరుకుంద అనే రైతుకు కనెక్షన్ ఇచ్చినట్లు చెప్పారు.

ఆయిల్ ట్యాంకర్ బీభత్సం

- బ్రేక్ ఫెయిలై దుకాణాలపైకి దూసుకొచ్చిన ట్యాంకర్ లారీ
- ఐదు షాపులు ధ్వంసం.. ఓ మహిళకు తీవ్రగాయాలు


బ్రేక్ ఫెయిల్ కావడంతో దుకాణాలపైకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్

కోడుమూరు రూరల్: కోడుమూరులో ఆయిల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. బుధవారం స్థానిక మెయిన్ బజార్‌లోని పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఓ ఆయిల్ దుకాణానికి కర్నూలు నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ వచ్చింది. అక్కడి దుకాణంలో ఆయిల్‌ను కొంతమేర లోడ్ చేసి తిరిగి వెళ్లే సందర్భంలో మెయిన్‌బజార్‌లో నుంచి రోడ్డుపైకి వెళుతుండగా బ్రేక్ ఫెయిలైంది. దీంతో ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చిరు దుకాణాలపైకి దూసుకెళ్లింది. దీన్ని గమనించిన అక్కడి వ్యక్తులు, దుకాణదారులు పక్కకు తప్పుకుని తప్పించుకోగా, టెంకాయల దుకాణం నడిపే మహిళ మలమ్మకు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్టేషన్ పక్కన టెలిఫోన్ తీగలకు సంబంధించిన దిమ్మెను ఢీకొట్టి లారీ ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. ట్యాంకర్ మరింత ముందుకెళ్లి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేది. కోడుమూరు పోలీసులు లారీని అక్కడి నుంచి పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు. గాయపడిన మహిళ మలమ్మను కోడుమూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతి చెందిన శాంతమ్మ


చంటి బిడ్డతో రవీంద్ర

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఒక ఇంట్లో నివాసం ఉంటున్న శాంతమ్మ (35) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బండి ఆత్మకూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన రవీంద్ర, తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన శాంతమ్మ రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి ఐదు నెలల క్రితం పాప జన్మించింది. రవీంద్రకు గతంలో మరో మహిళతో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవల కారణంగా విడాకుల కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. ఈ స్థితిలో శాంతమ్మతో కలిసి డోన్‌కు వచ్చి ఉంటూ కార్పెంటర్ పని చేసేవాడు. బుధవారం వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో కర్రతో బలంగా కొట్టిన రవీంద్ర బయటకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి చూడగా శాంతమ్మ మృతి చెంది పడిఉంది. సమాచారం అందుకున్న సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. నిందితుడు రవీంద్రను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించారు.

చంటి బిడ్డకు దిక్కెవరు?

తల్లి మృతి చెందడం, తండ్రి అరెస్టై పోలీసుల అదుపులో ఉండడంతో అభం శుభం తెలియని ఆ ఐదు నెలల చిన్నారికి దిక్కెవరని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతురాలి తల్లిదండ్రులది కోదాడ, నిందితుడి తల్లిదండ్రులది సింగవరం కావడం, వీరిద్దరు సహజీవనంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం లేనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో చిన్నారిని కర్నూలు శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బేతంచెర్ల: మండలపరిధిలోని ఆర్.బుక్కాపురం గ్రామ సమీపాన పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఎర్రగుంట్ల లక్ష్మన్న (61) పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోకి వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై ఆర్‌ఎస్ రంగాపురం రైల్వేస్టేషన్ మాస్టర్ డోన్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డోన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ సుధీర్‌కుమార్ సాహూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన బి. భార్గవ్

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం హనుమాన్ నగర్ కాలనీకి చెందిన హనుమన్న కుమారుడు భార్గవ్ (18) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. బుధవారం ఉదయం కిలోమీటర్ నంబర్ 497/19-20 ఆదోని–ఇస్వీ ఆర్‌ఎస్‌ల మధ్య రైలు నంబర్ 111311 కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారణ చేయగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్టు వెల్లడించారు.

తెరచుకున్న ఆర్ఐ గది


ఆర్ఐ గదిని తెరచి రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

హొళగుంద: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కొన్ని నెలల క్రితం రికార్డుల విషయంలో జరిగిన సంఘటనల కారణంగా ఇక్కడ విధులు నిర్వహిస్తూ సస్పెండ్ అయిన ఆర్ఐ దినోజ్ రాజశేఖరన్ గది తాళాలను అధికారులు బుధవారం తెరిచారు. ఆర్ఐ సస్పెండ్ అయిన సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దారు ప్రసాద్‌రాజు ఆర్ఐ గదిని సీజ్ చేశారు. అప్పటినుంచి దాదాపు రెండు నెలలకు పైగా గది తాళం వేసి ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఆర్ఐగా సర్వేయర్ డీటీ ముకుందరావుకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం రికార్డులు అవసరం కావడంతో బుధవారం కొత్త తహసీల్దారు సతీష్ సమక్షంలో డీటీ నిజాముద్దీన్, ఇన్‌చార్జ్ ఆర్ఐ ముకుందరావు, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది ఆర్ఐ గది తాళాలను తీసి రికార్డులను పరిశీలించారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కర్నూలు(హాస్పిటల్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు కర్నూలు డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ బుధవారం తెలిపారు. పంచ శైవక్షేత్రదర్శిని పేరుతో యాగంటి, మహానంది, ఓంకారం, భోగేశ్వరం, కాల్వబుగ్గ క్షేత్రాలను దర్శించుకునేలా బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు పెద్దలకు రూ.650, పిల్లలకు రూ.400 టికెట్ ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి రాత్రి కర్నూలుకు చేరుకుంటుందన్నారు. సరిపడా భక్తులు, ప్రయాణికులు కోరితే ఏ రోజైనా బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. ఈ ప్యాకేజి టూర్ సర్వీసులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ఆన్‌లైన్‌లో గానీ, బస్టాండ్‌లో గానీ, అధీకృత ఏజెంట్ల వద్ద గాని రిజర్వేషన్ చేయించుకుని సీట్లు పొందవచ్చని వెల్లడించారు.

శ్రీశైలానికి..: శ్రీశైల క్షేత్రానికి రద్దీని దృష్టిలో ఉంచుకుని కార్తీక మాసంలోని అన్ని ఆదివారాలు, సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యే క బస్సులను సాధారణ ఛార్జీలతో నడుపుతామని తెలిపారు.

అరుణాచలానికి..

తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్ర దర్శనం, గిరి ప్రదక్షిణకు ప్రతి నెలా పౌర్ణమి రోజున ఉదయం 7 గంటలకు కర్నూలు నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని డీఎం తెలిపారు. మార్గమధ్యంలో కాణిపాకం, వేలూరు గోల్డెన్‌టెంపుల్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం చేసుకుని రాత్రికి బస్సు అరుణాచలం చేరుకుటుందని చెప్పారు. గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి కర్నూలుకు బయలుదేరుతుందని తెలిపారు. ఇందుకు రూ.2 వేలు చార్జీ ఉంటుందని, టిక్కెట్లకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు కర్నూలు–2 డీఎం 9959225794, ఏఎం 7382871131, రిజర్వేషన్ కౌంటర్ 08518–256505 నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు


మృతి చెందిన ఖాజా ఉసేన్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు.ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. బనగానపల్లెకు చెందిన ఖాజా ఉసేన్ (24) స్థానికంగా ఐరన్‌మార్ట్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. తన స్నేహితుడైన సద్దాం ఉసేన్‌తో కలిసి సొంత పనినిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వస్తూ మండలంలోని అమడాల మెట్ట సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఖాజాఉసేన్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సద్దాం ఉసేన్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దొంగ అరెస్ట్.. బంగారం రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): దొంగతనాలకు పాల్పడే వ్యక్తిని నంద్యాల వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. నిందితుడు అనుపూరి శివదుర్గ అలియాస్ బట్టిని భీమవరం రస్తాలోని ఈద్గా వద్ద అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక నల్ల పూసల దండ-29.70 గ్రాములు, రెండు బంగారు గాజులు -22 గ్రాములు, వెండి కుంకుమ భరిణలు-6, ఒక వెండి చెంబు, వెండి దీపపు ప్రమిదలు-2, ఒక వెండి గిన్నె, వెండి ప్లేట్‌ను రికవరీ చేసి కోర్టుకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

మామూళ్ల కోసం వేధింపులు

- ఏపీఓకు ఫిర్యాదు చేసిన మహిళా సమాఖ్య నాయకులు

కర్నూలు (టౌన్): పేదలు తీసుకునే రుణాల్లో మామూళ్లు ఇవ్వాలని ఐక్య సంఘం లీడర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు వేధిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి రెడ్డి వాపోయారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయ పరిపాలన అధికారి ఆసిఫ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెప్మాలో పనిచేసే సీఓలు, ఆర్‌పీలు, లీడర్లు, పొదుపు సంఘం సభ్యులను లంచాల కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. డబ్బులు ఇవ్వకుంటే రుణాలు మంజూరు కావని తెగేసి చెబుతున్నారని, రూ.5 లక్షల రుణానికి మెప్మా సిబ్బందికి రూ.50 వేలు లంచం ఇవ్వాల్సివస్తోందని వాపోయారు. 6 వేలకు పైగా ఉన్న గ్రూపుల నుంచి నిత్యం వసూళ్లకు పాల్పడుతున్నారని దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. అవినీతికి పాల్పడుతున్న సీఓలు, ఆర్‌పీలపై చర్యలు తీసుకోకుంటే ఏసీబీ అధికారులకు పేర్లతో సహా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కుక్కల దాడిలో 150 గొర్రెపిల్లలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో బుధవారం సాయంత్రం కుక్కల దాడిలో సుమారు 150 గొర్రెపిల్లలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ నాగ ఎర్రమల, పెద్ద మద్దయ్య, నడిపి మద్దయ్య, రామకృష్ణ అనే నలుగురు అన్నదమ్ముళ్లకు చెందిన 150 గొర్రెపిల్లలను గ్రామ శివారులోని జగనన్న కాలనీ పక్కన ఇనుప కంచెతో నిర్మించిన గొర్ల దొడ్డిలో ఉంచారు. యజమానులు గొర్రెలు మేపుకునేందుకు బయటి ప్రదేశానికి వెళ్లారు. గొర్రెపిల్లల వద్ద ఎవరూ లేకపోవడంతో గమనించిన ఊరకుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి ఒక్కసారిగా దాడికి పాల్పడడంతో గొర్రెపిల్లలన్నీ అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న గొర్రెల యజమానులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఘోరం జరిగిపోవడంతో లబోదిబోమంటూ విలపించారు.